సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 29, మే, 2024



పెరుగుతున్న 'డయాలసిస్'
జిల్లాలో డయాలసిస్ చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కొత్తగూడెం ఆస్పత్రిలో వెయిటింగ్ లిస్ట్‌లో 40 మంది ఉన్నారు. 8లో



బలి తీసుకున్న ప్రమాదం
రఘునాథపాలెం మండలంలో కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో తల్లీ, నాలుగేళ్ల లోపు ఇద్దరు కుమార్తెలు కన్నుమూశారు. 8లో



వాతావరణం
జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్ర ప్రభావం చూపుతుంది. రాత్రికీ వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అభయాంజనేయ స్వామికి అభిషేకం



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారికి మంగళవారం వైభవంగా అభిషేకం, అర్చన నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, జూన్ 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొనాలని కోరారు.

ఎస్సెస్సీ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిబిరం

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరానికి విద్యార్థులు హాజరయ్యేలా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగే, గత మూడేళ్ల నుంచి పదో తరగతి లేదా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా కంప్యూటర్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఎలక్ట్రీషియన్, ఫొటోగ్రఫీ, డ్రైవింగ్, బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర ఉపాధి రంగాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల గిరిజన విద్యార్థులు భద్రాచలం ఐటీడీఏలోని భవిత సెల్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 81438 40906, 63026 08905 నంబర్లలో సంప్రదించాలని పీఓ సూచించారు.

విద్యార్థినికి పీఓ అభినందన



జ్యోతిని అభినందిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: పదో తరగతి ఫలితాల్లో పది జీపీఏ సాధించిన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కోవాసి జ్యోతిచందును ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. అశ్వారావుపేట మండలం ఊట్లపల్లికి చెందిన జ్యోతిని ఐటీడీఏలోని తన చాంబర్‌లో మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భీమునిగూడెం ఏజీహెచ్‌ఎస్ ఆశ్రమ పాఠశాలలో చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తేవడం హర్షణీయమని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యనభ్యసించడంతో పాటు మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం జ్యోతికి ప్రోత్సాహక బహుమతి అందజేసిన పీఓ.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులును అభినందించారు. కార్యక్రమంలో భీమునిగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు మండలం నిజాంపేటలో మొక్కలు లేని పల్లెప్రకృతి వనం



అటు పచ్చదనం.. ఇటు పైకం !

ప్రకృతి వనాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే భేష్..

- జిల్లాలో వెయ్యికి పైగా పార్కులు
- నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- పామాయిల్ పండిస్తే పంచాయతీలకు ఆదాయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత అడవులు పెంచే లక్ష్యంతో 2015లో హరితహారం కార్యక్రమాన్ని అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో భాగంగా 2019 నుంచి ప్రతీ గ్రామంలో అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పల్లె/పట్టణ ప్రకృతి వనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కనీసం పది కుంటల నుంచి ఎకరానికి పైగా స్థలంలో ఈ ప్రకృతి వనాలు ఏర్పాటయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 1280 పల్లె/పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. వీటికి తోడు సుమారు పది ఎకరాలకు అటుఇటుగా స్థలం ఉన్న చోట 119 మెగా ప్రకృతి వనాలు నిర్మించారు. వీటిలో పలు రకాలైన పూలతో పాటు నీడనిచ్చే చెట్ల మొక్కలను విరివిగా నాటారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఈ కార్యక్రమంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతీ పల్లె, పట్టణాల్లో పార్కులు అందుబాటులోకి వచ్చినట్టయింది.

నిర్వహణ లేక కళావిహీనంగా..

హరితహారంతో పాటు పల్లె, పట్టణ ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఎండిపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఆరంభంలో చెప్పింది. కానీ ఆచరణలో అది సాధ్యం కాలేదు. పైగా పంచాయతీలకు రావాల్సిన నిధుల్లో కోత పెట్టడంతో ప్రకృతి వనాల నిర్వహణ చాలాచోట్ల కష్టంగా మారింది. మరోవైపు సగానికి పైగా ప్రకృతి వనాలు జనావాసాలకు దూరంగా ఊరి నుంచి విసిరేసినట్టుగా ఉండడంతో ప్రజలు సైతం వాటిని పెద్దగా ఉపయోగించుకోలేని పరిస్థితి ఎదురైంది. వెరసి.. గత రెండు, మూడేళ్లుగా చాలాచోట్ల ప్రకృతి వనాలు ఎండిపోతూ కళావిహీనంగా తయారవుతున్నాయి.

అంతర్ పంటలకూ అవకాశం..

పామాయిల్ సాగులో అంతర్ పాటలు సాగు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలో పామాయిల్ తోటల్లో అంతర్ పంటగా కోకో, కాఫీ మొక్కలు పెంచుతున్నారు. చిన్నగా, సన్నమట్టలు ఉండే పామాయిల్ మొక్కలను ప్రకృతి వనాల్లో నాటితే వాటికింద పూలు, క్రోటాన్ మొక్కలు పెంచే అవకాశం ఉంటుంది. పామాయిల్ మొక్కలు పెరిగేలా మొదటి నాలుగేళ్లు జాగ్రత్తలు తీసుకుంటే ఆ తర్వాత పెద్దగా శ్రమించాల్సిన అవసరం లేదు. ఎకరాకు సగటున 12 టన్నుల దిగుబడి వచ్చినా.. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పామాయిల్ సాగు ద్వారా కనీసం రూ.1.50 లక్షల ఆదాయం సమకూరుతుంది.

పామాయిల్‌పై ఫోకస్ చేస్తే..

పామాయిల్ సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు ప్రకటించారు. ఒక అడుగు ముందుకేసి హరితహారంలో సైతం పామాయిల్ మొక్కలు నాటుతామని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,280 ప్రకృతి వనాలు, 119 మెగా ప్రకృతి వనాల్లో సైతం పామాయిల్ మొక్కలు పెంచే అంశాన్ని పరిశీలించాలనే డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది. మొక్కలు నాటిన తర్వాత నాలుగు నుంచి ఆరేళ్లలో దిగుబడి చేతికి వస్తుంది. పామాయిల్ చెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రకృతి వనాల నిర్వహణకు ఉపయోగించుకోవచ్చు. అంతేకాక పంచాయతీలకు కూడా అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.



నిర్వహణ సక్రమంగా లేని అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం ప్రకృతివనం

అందుబాటులో వనరులు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రకృతి వనాలు కలిపితే దాదాపు వెయ్యి ఎకరాల స్థలం ప్రభుత్వానికి అందుబాటులో ఉంటుంది. అనేక గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వం నిర్మించిన వర్మీ కంపోస్టు, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసే కేంద్రాలు ఉన్నాయి. చాలా పంచాయతీలకు ట్రాక్టర్లు, మల్టీ పర్పస్ వర్కర్లు అందుబాటులో ఉన్నారు. ఈ వనరులను ఉపయోగించుకుంటూ ప్రకృతి వనాల్లో పామాయిల్ మొక్కలు సాగు చేయడం కష్టమేమీ కాదు. పైగా పామాయిల్ సాగుపై ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించినట్టు కూడా అవుతుంది. ఈ మేరకు అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

యూనిఫాం తయారీలో జాప్యం తగదు

- కుట్టు కేంద్రాల్లో కలెక్టర్ ప్రియాంక తనిఖీ
- దుస్తులు కుట్టడంలో ఆలస్యంపై అసహనం
- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



మోరంపల్లిబంజరలో యూనిఫాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక, డీఆర్డీఓ విద్యాచందన

బూర్గంపాడు/పాల్వంచరూరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ జూన్ మొదటి వారంలో యూనిఫాం అందించాలని, ఈలోగా కుట్టు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర, పాల్వంచ మండలం సీతానగర్ కాలనీలో యూనిఫాం తయారు చేస్తున్న కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎన్ని యూనిఫాంలు సిద్ధం చేశారు.. ఇంకా ఎన్ని కుట్టాల్సి ఉందని ఆరా తీశారు. ఎంపీ బంజరలో 15 శాతం మాత్రమే కుట్టడం పూర్తయిందనే విషయాన్ని గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. టైలర్ల సంఖ్యను పెంచి పనులు వేగవంతం చేయాలని, జూన్ 5 లోగా 100 శాతం కుట్టడం పూర్తి కావాలని ఆదేశించారు. సీతానగర్ కాలనీలో కుట్టిన యూనిఫాంను పరిశీలించగా కాలర్ సైజ్ పెద్దగా ఉండడంతో చిన్న సైజ్‌తో కుట్టాలని, కొలతల ప్రకారం జాగ్రత్తగా తయారు చేయాలని సూచించారు. ఇప్పుడు కుట్టే డ్రెస్‌లు బాగా కుదిరితే ఇకపై జిల్లాలోని అన్ని హాస్టళ్లు, గురుకులాల యూనిఫాంలు కుట్టే బాధ్యత మహిళా సంఘాలకే అప్పగిస్తామని చెప్పారు. కాలనీలో తాగునీటి సమస్యను స్థానికులు కలెక్టర్ దృష్టికి తేగా తక్షణమే చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ ఏఈలను ఆదేశించారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పంచాయతీ ట్యాంకర్లతో నీరు సరఫరా చేయాలన్నారు.

కుట్టుకూలి పెంచాలి..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుడితే రూ. 50 మాత్రమే చెల్లిస్తామని అధికారులు చెబుతున్నారని, అందులో రూ. 30 వరకు మెటీరియల్‌కే ఖర్చవుతుందని మహిళా సంఘాల సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. డ్రెస్‌కు కనీసం రూ.100 చెల్లించాలని కోరారు. అయితే ఈ ధర ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం నిధులు అదనంగా ఇస్తే కుట్టు కూలి పెంచుతామని కలెక్టర్ తెలిపారు.

పనుల్లో జాప్యంపై ఆగ్రహం..

బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో పనుల జాప్యంపై కలెక్టర్ ప్రియాంక ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యుదీకరణ పనులు ఎందుకు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ పనుల ప్రణాళికలో విద్యుదీకరణ లేదని స్థానిక అధికారులు చెప్పగా.. విద్యుదీకరణ పనులు చేపట్టాలని పలుమార్లు వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌ల్లో స్పష్టమైన ఆదేశాలిచ్చామని, నివేదికలో ఎందుకు చేర్చలేదని మండలించారు. ఈ విషయమై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ, ఎంపీఓ, మండల అసిస్టెంట్ ఇంజనీర్లను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి, పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓలు కె.విజయ భాస్కర్‌రెడ్డి, జమలారెడ్డి, ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఏఈ లీలావతి, మల్లికార్జున్, ఎంపీఓ బి.నారాయణ పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్య తప్పదు

సూపర్‌బజార్(కొత్తగూడెం): క్షతగాత్రులకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హర్షవర్ధన్(14)కు జిల్లా ఆస్పత్రిలో అందించిన వైద్యం గురించి తన చాంబర్‌లో మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాధామోహన్‌ను వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణం మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. సకాలంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణనష్టం జరగదని అన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు పంపిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్‌ఎంఓ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో మోసం చేయొద్దు

- అలాంటి డీలర్లపై కఠిన చర్యలు తప్పవు
- ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరిక



వ్యవసాయాధికారులు, డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: నకిలీ విత్తనాలు విక్రయించి అమాయక రైతులను మోసం చేస్తే సహించేది లేదని, అలాంటి డీలర్లపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజ్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వ్యవసాయాధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాణ్యమైన, ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంగా తనిఖీలు నిర్వహించాలని, నకిలీ విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా దాడి చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయాధికారులు ధ్రువీకరించిన విత్తనాలు మాత్రమే అమ్మాలన్నారు. కొనుగోలు సమయంలో తప్పకుండా బిల్లు తీసుకోవాలని, వాటిని జాగ్రత్తగా ఉంచాలని రైతులకు సూచించారు. జిల్లాలో నకిలీ విత్తనాల వివరాలు తెలిస్తే 100కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.

మూడు క్రిమినల్ చట్టాలపై శిక్షణ..

త్వరలో అమలు కానున్న మూడు చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశంలో నేర, న్యాయ వ్యవస్థలో పూర్తిగా మార్పులు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ క్రమంలో భారతీయ న్యాయ సంహిత్, భారతీయ నాగరిక్ సంరక్ష సంహిత్, భారతీయ సాక్ష్య అధినియా అనే మూడు చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపారు. వీటిపై జిల్లాలోని ప్రతీ పోలీసుకూ అవగాహన అవసరమని అన్నారు. నేరస్తులకు శిక్షపడడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం జరగడంపై ఈ చట్టాలు ఎక్కువగా దృష్టి సారిస్తాయని అన్నారు. ఈ మూడు చట్టాలను గతేడాది డిసెంబర్ 21న పార్లమెంట్ ఆమోదం లభించిందని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ట్రైనీ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సీఐలు కరుణాకర్, రమేష్‌కుమార్, శివప్రసాద్, ఎస్సైలు షాహీన్, విజయ, రవి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం సకాలంలో అందజేయాలి

ములకలపల్లి: పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాం అందజేయాలని అదనపు కలెక్టర్ విద్యాచందన అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని సుబ్బనపల్లిలో యూనిఫాం తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యూనిఫాం త్వరగా తయారు చేయాలని మహిళా సంఘం సభ్యులకు సూచించారు. లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడతారని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట రూ.4కోట్లకు టోకరా

- రాష్ట్రంలోని 60మంది నుంచి వసూళ్లు
- పోలీసుల అదుపులో నలుగురి ముఠా



చుంచుపల్లి : నిరుద్యోగుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గ్రూప్ - 2, సింగరేణి, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.4 కోట్ల మేర వసూలు చేసిన నిందితులను చుంచుపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వివరాలను సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్సై గడ్డం ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. వరంగల్ రంగశాయిపేటకు చెందిన దాసు హరికిషన్ హైదరాబాద్ ఎర్రమంజిల్‌లో ఆర్ అండ్ బీ శాఖలో డీఈగా పనిచేస్తున్నానని పలువురిని నమ్మించాడు. ఈయన తన కుటుంబ సభ్యులు కలిసి గతంలో రైస్ పుల్లింగ్ ముఠాతో తిరిగినప్పుడు రుహత్ బేగ్, భీమవరం శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. వీరికి తోడు వరంగల్ రంగశాయిపేటకే చెందిన దాసు హర్ష, చిరుమర్తి సంజయ్, కొత్తగూడెంలోని రామాంజనేయ కాలనీకి చెందిన గుండా వినోద్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 60 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.4 కోట్ల వరకు వసూలు చేశారు. అయితే, డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు రాకపోవడం, నిందితుల నుండి సమాధానం లేకపోవడంతో బాధితులు పలువురు చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రామాంజనేయ కాలనీలోని వినోద్‌కుమార్ ఇంట్లో ఉన్నారనే సమాచారంతో హరికిషన్, హర్ష, సంజయ్, వినోద్‌కుమార్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు రుహత్ బేగ్, భీమవరం శ్రీనివాస్ పరారీలో ఉండగా.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ముఠాకు సహకరించిన మిగతా వారిని సైతం గుర్తించి కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఎవరైనా బాధితులు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మాయమాటలు చెప్పే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని ఆయన తెలిపారు.

ఏ ఓటు ఎవరికో !?

- ఎమ్మెల్సీ పోలింగ్‌పై అంచనాల్లో అభ్యర్థులు, నేతలు
- మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలుతుందా అన్న అంశంపై చర్చ
- రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించాల్సి వస్తుందని ఉత్కంఠ
- పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా తగ్గిన పోలింగ్



ఎమ్మెల్సీ ఓటు వేయడానికి బారులు దీరిన పట్టభద్రులు(ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వరుసగా జరుగుతున్న ఎన్నికలతో గెలుపోటములపై చర్చ ఉత్కంఠ రేకెత్తిస్తోంది. మొన్నటి వరకు అందరి దృష్టీ లోక్‌సభ ఎన్నికలపై ఉండగా.. ఇప్పుడు వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో గెలుపు ఎవరిదనే అంశంపైకి చర్చ మళ్లింది. మూడు ఉమ్మడి జిల్లాల్లో పోలింగ్ సరళి, శాతాన్ని పరిశీలిస్తున్న రాజకీయ పార్టీలు పరిస్థితిపై అంచనాకు రాలేకపోతున్నాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా ఎవరికి పోలయ్యాయి.. క్రాస్ ఓటింగ్ జరిగిందా.. మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువ పోల్ అయ్యాయనే అంశంపై లెక్కల్లో నిమగ్నమయ్యారు. మరోపక్క గత ఎన్నికలతో పోలిస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోలింగ్ శాతం తగ్గిన నేపథ్యాన గెలుపోటములపై విశ్లేషణ జరుగుతోంది.

ఆరా తీస్తున్న అభ్యర్థులు

సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసినప్పటి నుంచే ఓటింగ్ సరళిపై అభ్యర్థులు ఆరా తీయడంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థులతోపాటు రాజకీయ పార్టీల నాయకులు మూడు ఉమ్మడి జిల్లాల్లోని తమకు తెలిసిన వారికి ఫోన్ చేసి పోలింగ్ తీరుతెన్నులు తెలుసుకోవడంతో పాటు ఎవరికి ఎక్కువగా ఓట్లు పోల్ అయ్యాయని ఆరా తీశారు. ఈ అంశాలన్నీ బేరీజు వేసుకుంటూ ఫలితంపై అంచనాకు వస్తున్నారు.

మొదటి ప్రాధాన్యతే కీలకం

ఈ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతోనే ఫలితం తేలుతుందా, లేదా అన్న అంశంపై ఆసక్తి నెలకొంది. ప్రచారం సందర్భంగా అభ్యర్థులు, నాయకులు తమకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. అయితే పోలింగ్ శాతాన్ని పరిశీలిస్తూ ఈ ఓట్లతో ఫలితం తేలుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయినప్పటికీ మొదటి ప్రాధాన్యత ఓట్లు తమకే ఎక్కువగా పోల్ అయ్యాయని నమ్మకంగా ఉన్న అభ్యర్థులు.. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించాల్సిన అవసరం ఉండదని ఎవరికి వారే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫలితం తేలకపోతే..

మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలని పక్షంలో రెండో ప్రాధాన్యత ఓటు కీలకం కానుంది. అప్పుడు గెలుపోటములు ఊహించడం కూడా కష్టమవుతుంది. ఒక్కో జిల్లాలో ఒక్కో అభ్యర్థికి పడే ఓట్లలో తేడా ఉంటే మొదటి ప్రాధాన్యత ఓటుతో ఫలితం తేలడం కష్టమేననే చర్చ జరుగుతోంది. ఈ తరుణాన రెండో ప్రాధాన్యత ఓటు ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. ఈనేపథ్యాన మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన పట్టభద్రులు రెండో ప్రాధాన్యత ఓటు ఎవరికి వేశారనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కు ఎక్కువ ఓట్లు పోలయ్యాయనే ప్రచారం జరుగుతోంది. ఆయనకు నిరుద్యోగులు, విద్యార్థులు ఓటు వేసినట్లు చర్చ సాగుతోంది. దీంతో అశోక్ ఎవరి ఓట్లను చీల్చాడనేది కీలకంగా మారింది. అలాగే బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన వారిలో చాలా మంది రెండో ప్రాధాన్యత ఓటు బీఆర్‌ఎస్ అభ్యర్థికి వేశారన్న ప్రచారం సైతం మొదలైంది. ఇదే సమయాన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే రెండోది ఎవరికి వేసి ఉంటారనే అంశంపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది.

తగ్గిన పోలింగ్ ఎవరికి లాభం?

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అభ్యర్థులతో పాటు పార్టీల నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టభద్రులంతా తప్పక ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరినప్పటికీ పోలింగ్ శాతం మాత్రం తగ్గడం గమనార్హం. ఖమ్మం జిల్లాలో 2021 ఎన్నికల్లో 74.36 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి కేవలం 67.63 శాతానికి పరిమితమైంది. ఇక భద్రాద్రి జిల్లాలో గత ఎన్నికల్లో 73.30 శాతం పోలింగ్ జరగగా, ఈసారి 70.01 శాతమే నమోదైంది. ఇక ఇప్పుడు భద్రాద్రి జిల్లా కన్నా ఖమ్మంలోనే తక్కువ శాతం పోలింగ్ జరగడం గమనార్హం. ఖమ్మం జిల్లాలో 83,879 మందికి 56,730 మంది, భద్రాద్రి జిల్లాలో 40,106 మందికి 26,077 మంది ఓటు వేశారు. దీంతో ప్రాధాన్యత వారీగా పడిన ఓట్లపైనే గెలుపోటములు ఆధారపడి ఉంటాయనే అంచనాతో అభ్యర్థులు, నాయకులు లెక్కల్లో మునిగి తేలుతున్నారు. ఇందులో ఎవరి అంచనా నిజమవుతుందో తేలాలంటే వచ్చేనెల 5వ తేదీ వరకు ఆగాల్సిందే.

క్లుప్తంగా

అత్యవసర సేవలను నిర్లక్ష్యం చేయొద్దు



వాహనాలను పరిశీలిస్తున్న మేనేజర్ నాగేందర్

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం ద్వారా ఉచితంగా అందించే అత్యవసర సేవల విషయంలో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఉమ్మడి జిల్లా 108 ప్రాజెక్టు మేనేజర్ భూమా నాగేందర్ సూచించారు. అశ్వారావుపేటలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలోని 108, 102, 1962 వాహనాలను మంగళవారం పరిశీలించిన ఆయన ఉద్యోగుల పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాగేందర్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో వచ్చే ఫోన్లకు స్పందించి సత్వరమే చేరుకోవడం ద్వారా బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పశువైద్యుడు రాహుల్‌కుమార్, ఈఎంటీలు, పైలెట్లు రాము, అన్వర్, ధర్మరాజు, దుర్గాప్రసాద్, రవి పాల్గొన్నారు.

పీఎఫ్ ఉంటే పింఛన్, బీమా పొందొచ్చు..



పీఎఫ్ అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖమ్మంఅర్బన్: ప్రతీ ఉద్యోగి, కార్మికుడు పీఎఫ్ కలిగి ఉండాలని.. తద్వారా పింఛన్ అందడమే కాక బీమా వర్తిస్తుందని పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రబీలాదాస్ వెల్లడించారు. ఖమ్మంలోని వెంకటరమణ ఆటోమొబైల్స్ షోరూంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఈ–నామినేషన్ ఎలా దాఖలు చేయాలనే వివరించడంతో పాటు బీమా, ఇతర సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎఫ్ అధికారి మూర్తి, షోరూం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు టైర్లలో మంటలు

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

మణుగూరు రూరల్ : ఆర్టీసీ అద్దె బస్సు టైర్లలో నుంచి మంటలు రాగా, డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. మణుగూరు డిపోకు చెందిన బస్సు సోమవారం రాత్రి ఖమ్మం నుంచి మణుగూరుకు వస్తోంది. స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలోకి రాగానే బస్సు టైర్లలో నుంచి మంటలు లేచాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు నిలిపి ప్రయాణికుల సహాయంతో మంటలు ఆర్పేశాడు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ స్వామికి సమాచారం అందించాడు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని విషయాన్ని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవికాలం కావడంతో బ్రేక్ డ్రమ్ములు వేడికి పట్టేశాయని, దీంతో టైర్లలో మంటలు చెలరేగాయని తెలిపారు. ఆ సమయంలో బస్సులో పది మంది ప్రయాణికులు ఉన్నారని, డ్రైవర్ అప్రమత్తమై మంటలు ఆర్పేయడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు.

పెరుగుతున్న ‘డయాలసిస్’ కేసులు

- వెయిటింగ్‌లో 40 మంది పేషంట్లు
- జిల్లా కేంద్రంలో ఐదు పడకలు మాత్రమే..
- ప్రైవేట్‌లో రక్తం శుద్ధి చేసుకుంటే ఖర్చు ఎక్కువ
- పడకలు పెంచేందుకు ప్రతిపాదనలు



జిల్లా కేంద్రంలోని ఐదు పడకల డయాలసిస్ కేంద్రంలో పేషంట్లు

కొత్తగూడెంరూరల్: పలు రకాల కారణాలతో డయాలసిస్ (రక్తం శుద్ధిచేయడం) చేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం వెయిటింగ్ లిస్ట్‌లో ఇప్పటికే 40 మంది ఉన్నారు. వారికి వారంలో రెండు నుంచి మూడు సార్లు రక్తం శుద్ధి చేయాల్సి ఉన్నందున డయాలసిస్ కేంద్రాలను పెంచాలనే డిమాండ్ వస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో కేవలం ఐదు పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ పడకలు సరిపోక పోవడంతో కిడ్నీ రోగులు రక్తం శుద్ధి చేసుకోవటానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక కిడ్నీ రోగి వారానికి రెండు లేదా మూడు సార్లు రక్తం శుద్ధి చేసుకోవాలి. జిల్లా డయాలసిస్ కేంద్రంలో ప్రతి రోజూ 20 మందికి రక్తం శుద్ధి చేస్తారు. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో 2023లో 6,053 మందికి రక్తం శుద్ధి చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 2,420 కేసులు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో 42 మంది వెయింటింగ్ లిస్టులో ఉన్నారు. వీరిలో కొంతమందికి రక్తం శుద్ధి చేయకపోతే ప్రాణాల మీదికి వచ్చే అవకాశం ఉన్న కారణంగా జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేసుకుంటున్నారు. ఒక సారి రక్తం శుద్ధి చేస్తే రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు ఖర్చు అవుతోంది. ఒక్కొక్క పేషంట్‌కు వారానికి రెండు సార్లు, కొందరికి వారానికి మూడు సార్లు రక్తం శుద్ధి చేయాల్సి వస్తోంది. రెండు సార్లు రక్తం శుద్ధి చేసుకునే వారికి రూ.6 వేలు, మూడు సార్లు రక్తం శుద్ధి చేసుకొనే వారికి రూ.9 వేలు ఖర్చు అవుతున్నాయి. ఆర్థిక స్తోమత సరిగా లేని వారు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డయాలసిస్ కేంద్రాలకు వెళ్తున్నారు. జిల్లాలోని జూలురుపాడు, చండ్రుగొండ, సుజాతనగర్, సర్వారం, కొత్తగూడెం, పాల్వంచ, రేగళ్ల, బంగారుచెలక తదితర ప్రాంతాలకు చెందిన వారు జిల్లాలోని 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఆస్పత్రికి వచ్చి రక్తం శుద్ధి చేసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిలో కూడా వెయింటింగ్ ఉంటే, జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేటలోని ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి రక్తం శుద్ధి చేసుకుంటున్నారు. దూరమైనా.. భారమైనా తప్పనిసరి పరిస్థితుల్లో కిడ్నీ రోగులు డయాలసిస్ చేసుకుంటున్నారు.

జిల్లాలో డయాలసిస్ కేంద్రాలు ఇవే..

జిల్లాలోని కొత్తగూడెంలో 5, ఇల్లెందు 5 మణుగూరు 5, భద్రాచలం 10, అశ్వారావుపేటలో 5 యంత్రాలు ఉన్నాయి. భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో పది మిషన్‌లు ఉన్నాయి. 88 మంది ఉన్నారు. ఒక పేషంట్ వారానికి మూడు సార్లు రక్తం శుద్ధి చేసుకుంటున్నారు. 2023 సెప్టెంబర్‌లో పది పడకలతో ప్రారంభించారు. రెండు స్టాట్స్ ఖాళీగా ఉన్నాయి. ఒక పేషంట్‌కు నాలుగు గంటలపాటు రక్తం శుద్ధి చేస్తారు. రేషన్ కార్డు ఉంటే చేస్తారు. కొత్తగూడెం, పాల్వంచ, నుంచి ఎక్కువ మంది కిడ్నీ రోగులకు ఎక్కువ శాతం భద్రాచలానికి వస్తారు. ఈ ఆస్పత్రిలో కూడా డయాలసిస్ రోగులు పెరుగుతున్నారు. ఫలితంగా అప్పుడప్పుడూ వెయిటింగ్ లిస్ట్ ఉంటోంది.

సీఎంకు ఎమ్మెల్యే వినతి

జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో ఐదు పడకలతో ఉన్న డయాలసిస్ కేంద్రం సరిపోవడటం లేదని, 42 మంది వెయింటింగ్‌లో ఉంటున్నారని, మరో ఐదు పడకలు మంజూరు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదనలు పంపించారు.. పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో రూ.18 లక్షలతో గదులు నిర్మించారు. కానీ, డయాలసిస్ కేంద్రం మంజూరు కాలేదు. ఈ సమస్య ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలోని ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎంకు ప్రతిపాదన పంపించారు. భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో పది పడకలు ఉన్నా.. చర్ల, వెంకటాపురం, దుమ్ముగూడెం తదితర ప్రాంతాలకు చెందిన కిడ్నీ రోగులు భద్రాచలం డయాలసిస్ కేంద్రానికి రావడం వల్ల వెయిటింగ్ లిస్ట్ పెరుగుతోందని తెలుస్తోంది. చర్లలో డయాలసిస్ కేంద్రం మంజూరు చేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ప్రతిపాదనలు పంపించారు.

ఆరోగ్యశ్రీ బృందం సర్వే చేసింది..



జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, చర్లలో డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపించారు. ఆరోగ్యశ్రీ బృందం కొత్తగూడెం, పాల్వంచ, చర్ల ప్రాంతాలకు వచ్చి సర్వే చేశారు. త్వరలో ప్రభుత్వం మంజూరు చేసే అవకాశలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సెంటర్లు మంజూరైతే కిడ్నీ రోగులకు డయాలసిస్ చేయొచ్చు.

– రవిబాబు, డీసీహెచ్, కొత్తగూడెం

ఎన్టీఆర్ అంటేనే సంక్షేమ రాజ్యం

జయంతి సమావేశంలో మంత్రి తుమ్మల



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లి: దివంగత సీఎం ఎన్టీఆర్ అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా నిలిచారని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సత్తుపల్లిలో మంగళవారం జరిగిన ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సమాజానికి ఏం కావాలో ఎన్టీఆర్ అదే చేశారని, నీతి వంతమైన రాజకీయాలు ఆయన సొంతమని తెలిపారు. కాగా, గ్రీన్ ఫీల్డ్ హైవేలో వేంసూరు వద్ద ఎగ్జిట్, ఎన్టీఆర్ కాల్వ విస్తరణ, ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, ఫుడ్‌పార్కు, యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేసి సత్తుపల్లి ప్రజల రుణం తీర్చుకుంటానని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడగా కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, శివ వేణు, చల్లగుళ్ల నర్సింహారావు, ఉడతనేని అప్పారావు, పుచ్చకాయల సోమిరెడ్డి, బండి గురునాథ్‌రెడ్డి, ఎం.డీ.ఫైజుద్దీన్, తోట సుజలరాణి, గాదె చెన్నారావు, బొంతు శ్రీనివాసరావు, దూదిపాల రాంబాబు, వినుకొండ కృష్ణ, జూపాటి పాపారావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పంట రుణాలు మాఫీ చేసి.. పంటల సీజన్‌లో అన్నదాతలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. అలాగే, ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలుచేయాలని, అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, సకాలంలో రైతుబంధు, పింఛన్లు అందజేయాలని కోరారు. అంతేకాక అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు స్థలమున్న వారికి ఇళ్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు భూక్యా వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణం

టెక్ మహేంద్రలో ఉద్యోగం.. అమెరికా వెళ్లేందుకు ఏర్పాట్లు



వర్షిత (ఫైల్)

వైరారూరల్: అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తాగునీటి బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. వైరా మండలంలోని నారపునేనిపల్లిలో మంగళవారం చోటు చేసుకున్న ఈఘటన వివరాలు... గ్రామానికి చెందిన దావూలూరి కిరణ్‌కుమార్ – ప్రసన్న దంపతుల మొదటి కుమార్తె వర్షిత అలియాస్ వందన (23)కు అమెరికాలో ఎంఎస్ చదువుతున్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ఎరుకోపాడు బండి గోపితో వివాహం జరిగింది. పెళ్లయిన నాలుగు రోజులకే గోపి అమెరికా వెళ్లిపోగా, వర్షిత హైదరాబాద్‌లోని టెక్ మహేంద్ర కంపెనీలో ఉద్యోగిగా చేరింది. కొంత కాలంగా తీవ్ర కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమెకు నాలుగు రోజుల క్రితం తల్లిదండ్రులు హైదరాబాద్‌లో చికిత్స చేయించి నారపునేనిపల్లికి తీసుకొచ్చారు. అయితే, సోమవారం రాత్రి వర్షితకు కడుపు నొప్పితీవ్రం కావడంతో ఇంటి ఆవరణలోని తాగునీటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం వర్షిత కోసం తల్లిదండ్రులు వెతుకుతుండగా బావిపై చెక్క పక్కకు జరిపి ఉండడంతో పరిశీలించగా ఆమె మృతదేహం కనపడింది. ఘటనపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో తహసీల్దార్ కే.వీ.శ్రీనివాసరావు, ఎస్సై వంశీకృష్ణ చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, వర్షిత అమెరికా ప్రయాణానికి వీసా ఏర్పాట్లలో ఉండగా బలవన్మరణానికి పాల్పడడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

కారు ఢీకొని యువకుడు మృతి



నర్సింహారావు(ఫైల్)

తల్లాడ: మండలంలోని అంజనాపురం సమీపాన మంగళవారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న యువకుడిని ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం ... మండలంలోని గోపాలపేటకు చెందిన డిగ్రీ విద్యార్థి పొన్నెబోయిన నర్సింహారావు(23) మోటార్ సైకిల్‌పై తల్లాడ నుంచి వీఎం.బంజర లోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో రామచంద్రాపురం గ్రామానికి చెందిన నూనావత్ నర్సింహారావు లిఫ్ట్ అడగగా ఎక్కించుకున్నాడు. వీరి వాహనాన్ని అంజనాపురం ఇటుక బట్టీల సమీపాన కల్లూరు వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో నర్సింహారావు తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, వెనకాల కూర్చున్న నర్సింహారావుకు సైతం గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మృతుడి తండ్రి వెంకటి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు

బూర్గంపాడు: ఇరవెండికి సమీపంలోని ఐటీసీ పంప్ హౌస్ వద్ద గోదావరిలో ఈదుకుంటూ నది దాటుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దుమ్ముగూడెం మండలం తూరుబాక గ్రామ పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఎర్రబోలు కోటిరెడ్డి మంగళవారం ఉదయం ఇరవెండి వైపు నుంచి గోదావరి దాటి స్వగ్రామం వెళ్లేందుకు నీళ్లలో దిగి ఈదుతున్న క్రమంలో గల్లంతయ్యాడు. రెండురోజుల క్రితం అశ్వాపురం మండలంలోని రామచంద్రాపురంలో ఉన్న తన సోదరి ఇంటికి వచ్చిన కోటిరెడ్డి మంగళవారం ఉదయం తన ఇంటికి వెళ్లేందుకు గోదావరి దాటుతున్న క్రమంలో గల్లంతయ్యాడు. ఇటీవల గోదావరిలో నీటి ప్రవాహం కొద్దిగా పెరగటంతో లోతు అంచనా వేయలేక గల్లంతైనట్లు స్థానికులు భావిస్తున్నారు. కోటిరెడ్డి గల్లంతైన విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కోటిరెడ్డి ఆచూకీ కోసం నాటు పడవలతో గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మంగళవారం సాయంత్రం వరకు అతని ఆచూకీ లభించకపోవటంతో బుధవారం రెస్క్యూ టీమ్‌తో గాలింపు చర్యలు చేపడతామని ఎస్‌ఐ తెలిపారు. గల్లంతైన కోటిరెడ్డికి భార్య గీత, ఇద్దరు పిల్లలున్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్, బైక్ స్వాధీనం



ఆభరణాలు, నిందితులను చూపుతున్న పోలీసులు

మణుగూరుటౌన్: ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. పలుచోట్ల చోరీలకు పాల్పడుతూ పట్టుబడి జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. అయినా తీరు మార్చుకోక మళ్లీ చోరీలు చేస్తున్న ఓ వ్యక్తి పోలీసులకు పట్టుబడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సీఐ సతీశ్‌కుమార్, ఎస్‌ఐలు ప్రసాద్, రాజేశ్ తెలిపిన వివరాలు... మణుగూరులో మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పల్సర్ బైక్‌పై అశ్వాపురం – మణుగూరు వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా భూపాలపల్లికి చెందిన దొరిశెట్టి స్వామి నిరంజన్‌గా తేలింది. ఆయన మణుగూరుతో పాటు భద్రాచలంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి డిసెంబర్‌లో జైలుకు వెళ్లి ఈనెల 7వ తేదీన బెయిల్‌పై బయటకు వచ్చినట్లు గుర్తించారు. ఆపై ములకలపల్లికి చెందిన జున్నూరి శ్రీనుతో కలిసి మణుగూరులోని పీ.వీ.కాలనీతో పాటు కొత్తగూడెం ఏరియాలోని పలు ఇళ్లల్లో జున్నూరి శ్రీనుతో కలిసి చోరీ చేశాడు. చోరీ చేసిన వస్తువులను భద్రాచలానికి చెందిన బానోత్ మోహన్‌కు విక్రయించినట్లు నిందితుడు ఇచ్చిన సమాచారంతో 9తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, ల్యాప్‌టాప్, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకుని మోహన్, స్వామి నిరంజన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. అలాగే, పరారీలో ఉన్న శ్రీను కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. కాగా, స్వామి నిరంజన్‌పై గతంలో భూపాలపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, బెల్లంపల్లి, వెంకటాపురం, గణపురం, భద్రాచలం, మణుగూరు పోలీస్‌స్టేషన్లలో కలిపి 14 చోరీ కేసులు ఉండగా.. జైలుకు వెళ్లి బెయిల్‌పై రాగానే చోరీలకు పాల్పడడాన్ని అలవాటుగా మార్చుకున్నాడని సీఐ వివరించారు.

వేధిస్తున్న భర్తపై కేసు

అశ్వారావుపేటరూరల్: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడుతున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన చింత నాగశ్రీ స్వర్ణభారతికి సుమారు 14 ఏళ్ల కిందట ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన చింత నాగదుర్గాప్రసాద్‌తో వివాహమైంది. దంపతులకు ముగ్గురు సంతానం. కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేయడంతోపాటు దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాధితురాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా భర్త నాగదుర్గ ప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధం



కాలిపోయిన గడ్డివామి

సుజాతనగర్ : షార్ట్ సర్క్యూట్‌తో వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన సుజాతనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సత్తెనపల్లి సత్యనారాయణకు చెందిన వరిగడ్డి వామి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అందులో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి గడ్డివామికి అంటుకున్నాయి. దీంతో గడ్డంతా అగ్నికి ఆహుతి అయింది. స్థానికుల సమాచారం మేరకు కొత్తగూడెం నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ముగ్గురిని బలి తీసుకున్న ప్రమాదం

హరియాతండా వద్ద చెట్టును ఢీకొట్టిన కారు

- తల్లి, ఇద్దరు కుమార్తెల మృతి.. గాయాలతో బయటపడిన భర్త
- అల్లుడే చంపేశాడని మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ



ఘటనాస్థలిలో కారు



భర్త ప్రవీణ్‌తో కుమారి, పిల్లలు (ఫైల్)



బోడా కుమారి, కృషిక, తనిష్క మృతదేహాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం మంచుకొండ – పంగిడి రోడ్డులో హరియాతండా సమీపాన చెట్టును ఢీకొట్టిన ఘటనలో తల్లీ, ఇద్దరు కుమార్తెలు కన్నుమూశారు. ఈ ఘటనలో కారు నడుపుతున్న భర్త తీవ్రగాయాలతో బయటపడ్డాడు. మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరగగా.. తమ అల్లుడే ముగ్గురిని హత్య చేసినట్లు మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించడం గమనార్హం. స్థానికుల కథనం ప్రకారం ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బావోజీ తండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లో ఫిజియోథెరపీ డాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఏన్కూరు మండలం రంగాపురం తండాకు చెందిన కుమారి(26)తో ఐదేళ్ల క్రితం వివాహం జరగగా, నాలుగు, మూడేళ్ల కుమార్తెలు కృషిక, తనిష్క ఉన్నారు. వీరంతా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. అయితే, ప్రవీణ్ తల్లికి అనారోగ్యంగా ఉండడంతో పది రోజుల పాటు సెలవు పెట్టిన ప్రవీణ్ భార్యాపిల్లలతో సహా బావోజీ తండాకు వచ్చాడు.

ఆధార్ కార్డులో మార్పుల కోసం..

ప్రవీణ్ – కుమారి దంపతుల చిన్నకుమార్తె ఆధార్ కార్డులో మార్పులు చేయించేందుకు మంగళవారం నలుగురు కలిసి కారులో మంచుకొండ వెళ్లారు. అక్కడి నుంచి వస్తుండగా హరియాతండా సమీపాన మూల మలుపు వద్ద చెట్టును కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కుమారి, ఇద్దరు కుమార్తెలు కృషిక, తనిష్క అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ప్రవీణ్ తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. అయితే, కారు వేగంగా వెళ్లి చెట్టును ఢీకొనగా.. ఆ మార్గంలో ఎవరూ రాకపోవడంతో గంటకు పైగా అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం అటువైపుగా వెళ్తున్న వారు రోడ్డుపక్కగా దూసుకెళ్లిన కారులో లైట్లు వెలుగుతుండడంతో చూసి బయటకు తీసేసరికే కుమారి, ఆమె పిల్లలు మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు సమాచారం అందుకున్న ఖమ్మం నగర ఏసీపీ రమణమూర్తి, రఘునాథపాలెం సీఐ శ్రీహరి ఘటనాస్థలికి వెళ్లి అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదం కాదు.. అల్లుడే చంపేశాడు



ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద రోదిస్తున్న కుమారి తల్లి, బంధువులు

రోడ్డు ప్రమాదంలో కుమారి, ఆమె కుమార్తెలు కన్నుమూశారనే సమాచారంతో కుమారి తల్లిదండ్రులు, బంధువులు ఏన్కూరు మండలం రంగాపురం తండా నుంచి పెద్దసంఖ్యలో పెద్దాస్పత్రి మార్చురీ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కుమార్తె, మనవరాళ్ల మృతదేహాలను చూసి వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే, ఇది రోడ్డు ప్రమాదం కాదని తమ అల్లుడే ముగ్గురిని హత్య చేశారని కుమారి తల్లిదండ్రులు హరిసింగ్ – పద్మ ఆరోపించారు. ముగ్గురి మృతదేహాలపై ఎక్కడా రక్తం వచ్చిన దాఖలు లేవని వారు పేర్కొన్నారు. అంతేకాక డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్ మాత్రమే గాయాలతో బయటపడడం ఏమిటని ప్రశ్నించారు. ప్రవీణ్ డాక్టర్ కావడంతో ఐదేళ్ల క్రితం రూ.24 లక్షల కట్నంగా ఇచ్చి వివాహం జరిపించామని, కానీ ఇద్దరు అమ్మాయిలే జన్మించడంతో మగపిల్లాడు లేడని తరచుగా తమ కుమార్తెను వేధించేవాడని ఆరోపించారు. అంతేకాక వివాహేతర సంబంధాలతో నిత్యం వేధించేవాడని వాపోయారు. గత 20 రోజుల క్రితం కూడా ఓ యువతితో కేరళ వెళ్లొచ్చాడని, ఈనెల 25న వివాహ వార్షికోత్సవానికి కేక్ తీసుకు రావాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈమేరకు ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కుమారి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు. అలాగే, ప్రమాదంపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా.. మృతుల కుటుంబానికి సానుభూతి ప్రకటించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా స్థావరాలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం గ్రామం అటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు మంగళవారం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు జరిపారు. సుమారు 2,500 లీటర్ల బెల్లం పానకాన్ని, 60 లీటర్ల నాటుసారా, పది ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి ఉపయోగించే 15 ప్లాస్టిక్ డ్రమ్ములను, స్టీల్ బిందెలను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దుమ్ముగూడెం మండలంలో కొంతమంది అక్రమ సంపాదన కోసం అమ్మోనియా వంటి విషపూరిత రసాయనాలు కలుపుతూ, నాటుసారా తయారు చేసి విక్రయిస్తూ పేద ప్రజల జీవితాలతో, ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కేశవరావు హెచ్చరించారు.

దుగినేపల్లిలో...

కరకగూడెం: పినపాక మండలంలోని దుగినేపల్లి గ్రామంలో నాటుసారా స్థావరాలపై మంగళవారం మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, ఏడూళ్లబయ్యారం ఎస్‌ఐ వెంకటప్పయ్య ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ సందర్భంగా 700 లీటర్ల బెల్లం పానకం, సామగ్రిని ధ్వంసం చేసి నాటుసారా కాస్తున్న మాలోత్ బుజ్జిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళకు పొలిశెట్టి నాగమణి సారా తయారీకి అవసరమైన బెల్లం, పటిక సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలడంతో వారిద్దరిపై కేసు నమోదు చేశారు. అనంతరం గ్రామంలో నాటుసారా వల్ల కలిగే దుష్పరిణామాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ కిశోర్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

11కేజీల ఎండు గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: మీదుగా వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 11 కేజీల గంజాయిని ఎక్సైజ్ స్టేషన్–2 పోలీసులు, జీఆర్పీ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి ముంబై వెళ్లుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రిజర్వేషన్ బోగీలో 11 కేజీల గంజాయి లభించగా, బాధ్యుల జాడ తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, ఎస్‌ఐ సరిత సిబ్బంది పాల్గొన్నారు.